క్లుప్తంగా

పనులు త్వరగా పూర్తి చేయండి
మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్



ధర్మాజీపేటలో నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మబడి పథకం కింద ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక మున్సిపల్ పరిధిలో 17 పాఠశాలలకు అమ్మబడి పథకం కింద రూ.59.65 లక్షలు మంజూరయ్యాయన్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ పృథ్వీరాజ్, మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ కుమార్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

20న మగ్గం వర్కు శిక్షణ ప్రారంభం
హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ నుంచి ఉన్నతి పథకంలో మహిళలకు మగ్గం వర్కు శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి గురువారం తెలిపారు. 2018–19 నుంచి 2022–23 వరకు ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పనులు పూర్తి చేసుకున్న మహిళలు ఈ శిక్షణ పొందుటకు అర్హులన్నారు. 18వ తేదీ ఉదయం 11గంటలకు అర్హత గల మహిళలు మూడు ఫొటోలు, ఆధార్ కార్డు, జాబ్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భూసారానికి ముప్పు



గాగిల్లాపూర్ సమీపంలో తగలబడుతున్న వరి కొయ్యలు

బెజ్జంకి(సిద్దిపేట): పంట పొలాల్లోని వరి కొయ్యలను పలువురు రైతులు కాల్చివేస్తుండటంతో భూసారానికి ముప్పు వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు అన్నారు. వరికొయ్యల కాల్చివేస్తుండటంతో మంటలు వ్యాపించి వ్యవసాయ పనిముట్లు, మోటారు పైపులు కాలిపోతున్నాయి. ఏటా హార్వెస్టర్‌లతో వరి కోతలు చేపడుతున్న రైతులు అందులో ఉన్న వరి గడ్డిని, కొయ్యలను వదిలి దున్నే సమయాల్లో కాల్చివేస్తున్నారు. ఇలా చేయడం వల్ల మంటల వేడికి నత్రజని, భాస్వరం వంటి పోషకాలు నేలలోనే క్షీణించి పంటల దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. వరికొయ్యలను కాల్చకుండా పొలంలోనే మురిగిపోయేలా చేసి కలియదున్నితే పోషకాలు పెరిగి పంటల దిగుబడి వస్తుందని ఏఈఓ సంతోష్ తెలిపారు.

పోరాటాల సిద్ధాంతకర్త వీరన్న
సిద్దిపేటకమాన్: కులవర్గ జమిలి పోరాటాల సిద్ధాంతకర్త మారోజు వీరన్న అని బహుజన కమ్యూనిస్టు పార్టీ, బీడీఎస్‌ఎఫ్, బహుజన మహిళా సంఘం, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. వీరన్న వర్ధంతి సందర్భంగా సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన చిత్రపటానికి వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. దళిత ఉద్యమాలు, తెలంగాణ సాధన ఉద్యమంలో వీరన్న మమేకమయ్యారని, రాష్ట్రంలో బహుజనుల సామాజిక తెలంగాణ ఏర్పాటుకు కార్యాచరణ చేశారన్నారు.

నేత్రపర్వంగా ఆలయ వార్షికోత్సవం
మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం గురువారం జరిగింది. గణపతి పూజ, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చన, బిల్వార్చన, నారికేళార్చ, కుంకుమార్చన, దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మ వారికి సామూహిక మంగళహారతి ఇచ్చారు. తీర్థ ప్రసాదాలు అందజేసిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ
మర్కూక్(గజ్వేల్): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందుతారని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు తమ వంతు కృషి చేశారన్నారు.

పాడిగేదే మృతి
దుబ్బాకటౌన్: విద్యుదాఘాతంతో పాడిగేదే మృతి చెందింది. గురువారం దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన తాటికొండ ఎల్లవ్వ రోజు మాదిరిగానే గేదెలను మేత కోసం విడిచింది. ఓ గేదె గడ్డిని మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుఘాతానికి గురై మృతి చెందింది.

భూసారం పెంపుతో అధిక దిగుబడి

- భూసార పరీక్షలపై అవగాహన లేమి
- సరైన వర్షపాతం లేక, తెగుళ్లతో పంటలకు నష్టం
- భూసార సదస్సులకు ప్రాధాన్యం
- రైతులు పాల్గొనేలా అధికారుల కార్యాచరణ



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు (ఫైల్)

పంటల దిగుబడి ఆశించినంత సాధించాలంటే ముందు భూసార పరీక్షలు చేయించాలి. ఈ ఏడాది మేలో నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. భూమిలోని పోషక విలువలు తగ్గితే ఆమేర రసాయన ఎరువులు వాడుతుంటారు. ఇలా విరివిగా రసాయన ఎరువులు వాడుతుండటంతో క్రమేణ భూసారం తగ్గుతోంది. అంతేకాకుండా తెగుళ్ల బెడద కూడా పెరిగి పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. రైతులకు భూసార పరీక్షలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తే పంటలు ఎలా పండించాలో వారికి తెలుస్తుంది.

చిన్నకోడూరు(సిద్దిపేట): వ్యవసాయ క్షేత్రాలు ఏ రకమైన పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయి. భూమిలో పోషకాల స్థాయి, ఎలాంటి ఎరువులు వేయాలని అనే విషయాలపై రైతులకు అవగాహన కలగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. సరైన సమయంలో వర్షాలు పడకపోవడం, తెగుళ్ల బెడదతో రైతులు ఏటా పంటలు నష్టపోతున్నారు. ఈ క్రమంలో భూసార పరీక్షలు నిర్వహించి వాతావరణ పరిస్థితులకు తగిన పంటలను సాగుచేస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

అవగాహన లేమితో వెనుకంజ

రైతులు పంటల సాగుపై దృష్టి పెడుతున్నారు. కానీ భూమిలోని పోషకాల స్థాయి తెలుసుకోవడం లేదు. విరివిగా రసాయన ఎరువుల వాడకంతో సాగు వ్యయం పెరగడంతోపాటు భూమిలో పోషక విలువలు తగ్గుతున్నాయి. నేల స్వభావం తెలియక అవసరానికి మించి క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. భూసార పరీక్షల ప్రాధాన్యంపై రైతు సదస్సులు, సమావేశాల్లో వ్యవసాయ శాఖ పదే పదే చెబుతున్నా రైతులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. అలాగే భూసార పరీక్షల ఫలితాలను అధికారులు సమయానికి అందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫలితాల ఆధారంగా..

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడి వస్తుందని అధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరం. భూసార పరీక్షల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లోని ఉదజని, లవణ సూచిక పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీని ద్వారా అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు ఒకే పంటను తరుచుగా సాగు చేస్తుండటంతో పాటు అధిక రసాయన ఎరువులను వినియోగిస్తుండటంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడులు తగ్గుతాయి.

భూసార పరీక్షలతో మేలు

భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయి. రైతులు భూసార పరీక్షలు ఏటా చేయించుకోవాలి. ఈ పరీక్షలతో భూమి సారం ఎంతో తెలుస్తుంది. ఆ మేరకు భూమికి కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే అవకాశం ఉంటుంది. మేలో భూసార పరీక్షలు చేయించుకోవాలి. పంటల సాగులో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి.

– జయంత్ కుమార్, ఏఓ, చిన్నకోడూరు

ఉత్తమ పద్ధతులతో పర్యావరణ రక్షణ



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సతీశ్ కుమార్

సిద్దిపేటరూరల్: ఉత్తమ పద్ధతుల పాటిస్తూ జీవనశైలిలో మార్పు తెచ్చి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది గ్రామంలో శ్రీ బుగ్గ రాజేశ్వర రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పర్యావరణం కోసం జీవనశైలి అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ సతీశ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ కోసం భూసార పరీక్షలు, ఉత్తమ యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, జీవన ఎరువులు, జీవనియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్సీ రైతులకు ఉచితంగా టార్పాలిన్ కవర్లు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ఖురేషి, సంఘం చైర్మన్ ఎల్లారెడ్డి, ఏఓ రమణి, ఎంపీటీసీ సభ్యుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో మోసాలకు పాల్పడుతున్న వారిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మిరుదొడ్డి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాల తూకంలో వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రంలో వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్లు లేక రైతులు వాటిని అద్దెకు తెచ్చుకుంటున్నారన్నారు. మౌలిక వసతులు కల్పించక పోవడంతో ఇటీవల వడదెబ్బతో రైతు యాదాగౌడ్ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. తూకంలో అవకతవకలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట ధర్మారం ఎంపీటీసీ సభ్యుడు చెప్యాల శ్రీనివాస్, పార్టీ జిల్లా నాయకులు సూకూరి లింగం, కాస కిష్టయ్య తదితరులు ఉన్నారు.

నిర్వహణ పేరిట నిధుల దుర్వినియోగం
సిద్దిపేటజోన్: క్రికెట్ స్టేడియం నిర్వహణ పేరిట నిర్వాహకులు నిధులను దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆరోపించారు. గురువారం స్టేడియాన్ని సందర్శించి మాట్లాడారు. సుమారు రూ.7 కోట్లతో చేసిన పనుల వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. క్రికెట్ టోర్నీ ఖర్చుల మీద శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గత పదేళ్లలో స్టేడియానికి వచ్చిన ఆదాయ వివరాలను వెల్లడించాలన్నారు. నిధుల దుర్వినియోగంపై జిల్లా క్రీడల శాఖ అధికారి స్పందించాలని కోరారు. క్రికెట్ శిక్షణ తరగతులను నైపుణ్యం ఉన్న వారితో నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మధు, వహబ్, అస్మత్, వినోద్ తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

మాలల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాంచందర్



మాట్లాడుతున్న మాలల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాంచందర్

మిరుదొడ్డి(దుబ్బాక): భారత రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలని మాలల జేఏసీ రాష్ట్ర చైర్మన్ చెరుకు రాంచందర్, వివిధ రాష్ట్ర సంఘాల నేతలు మందాల భాస్కర్, తాళ్లపల్లి రవి, శంకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని లింగుపల్లిలో మాలల జేఏసీ, మాల మహానాడు, ఓయూ జేఏసీ, డీబీఎఫ్, దళిత సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ మన కర్తవ్యం అంశంపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించిన భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు. సమాజంలో మనిషిని మనిషిగా గుర్తించని మనుధర్మ శాస్త్రాన్ని తిరిగి అమలు చేయాలని బీజేపీ ఆసక్తి చూపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తుమ్మ శ్రీనివాస్, కృపాకర్, బాల్‌నర్సు, కిరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు డబ్బులు చెల్లించాలి
డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్‌శేఖర్

చిన్నకోడూరు(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని మల్లారం, సికింద్లాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కూలీల డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని హక్కుగా అమలు చేయాలన్నారు. కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం: కేసు నమోదు
సిద్దిపేటరూరల్: దాబాలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామ శివారులో ముత్తగారి బాల్‌నర్స్‌గౌడ్ నిర్వహిస్తున్న దాబాలో ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు రూరల్ పోలీసులు దాబాలో తనిఖీలు చేపట్టగా 10 లీటర్ల మద్యం బాటిళ్లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గజ్వేల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గజ్వేల్‌రూరల్: పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారిన పడమని గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూడాలన్నారు. పరిసరాల అపరిశుభ్రతతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమకాటుతో మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్‌గున్యాలాంటి వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వాసుదేవ్, రామ్, శశి, దుర్గాబాయి పాల్గొన్నారు.

ఆరోగ్యం మన చేతుల్లోనే

జగదేవ్‌పూర్(గజ్వేల్): జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యప్రకాష్, స్వరూప, నారాయణ పాల్గొన్నారు.

డ్రైడేతో డెంగీని అరికడదాం

అక్కన్నపేట(హుస్నాబాద్): వారానికి ఒకరోజు డ్రైడే పాటించి డెంగీని అరికడదామని వైద్యాధికారి డాక్టర్ రమ్య పిలుపు ఇచ్చారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని గురువారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు జాతీయ డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు.

వాసవీమాత పారాయణం
ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో వాసవీమాత పారాయణ చేశారు. గురువారం సిద్దిపేట ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు గోపూజ, అభిషేకం, వాసవీ అష్టోత్తరం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు జూలూరి స్వరూపరాణి, పుల్లూరి సుష్మ, మర్యాలవాణి, నాగమల్లసంధ్య, లావణ్య, స్వరూపరాణి, అరుణ, మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణ



ధూళిమిట్టలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గిరి కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని జెడ్పీటీసీ సభ్యుడు కొండల్‌రెడ్డి అన్నారు. గురువారం దూళిమిట్టలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టనున్నారన్నారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలల్లో పార్టీ తరపున పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొల సాయిలు, మాజీ సర్పంచ్ సందింటి లక్ష్మి, జిల్లా నాయకుడు నారోజు శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు అనిల్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలి

చేర్యాల(సిద్దిపేట): వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి పిలుపు నిచ్చారు. గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశంలో జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి అఖిల్ పాషా, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మున్సి పల్ కౌన్సిలర్ ఆడెపు నరేందర్, ఎంపీటీసీ సభ్యుడు సుంకరి శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

హుస్నాబాద్: రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ రైతు వ్యతిరేక ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. హుస్నాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు సన్నవడ్లకే ఇస్తామడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. దొడ్డు రకం వడ్లకు బోనస్ ఇవ్వాల్సిందేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్, కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

గ్యారెంటీల గారడీలతో కాంగ్రెస్ మోసం

కొండపాక(గజ్వేల్): గ్యారెంటీల గారడీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందన్నారు. రైతు రుణమాఫీ, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్‌ను చెల్లిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణలో అత్యధికంగా వరి పండించే రైతులున్నారన్న విషయాన్ని మర్చిపోయి ఎన్నికల్లో సాధ్యం కానీ హామీలిచ్చారని విమర్శించారు.

రైతాంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

గజ్వేల్: రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం గజ్వేల్ మార్కెట్‌యార్డ్ వద్ద ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కి నేడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకుడు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థిక సహాయం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన జిందం మల్లేశం ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షుడు చల్లా మహేందర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు తోటి యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లయ్య, బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన బండి సంపత్‌ను కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శిగా నియమించినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో సంపత్‌కు నియామకపత్రాన్ని అందజేశారు.

◆ గీత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వీరన్నపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు బొందుగుల చంద్రశేఖర్ ఈనెల 12వ తేదీన తాటిచెట్టు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. బాధితుడు చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అరుణ్ కోరారు.

◆ అడ్మిషన్లు ప్రారంభం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి ఐటీఐ అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ గురువారం తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు అడ్మిషన్లు స్వీకరిస్తామన్నారు. విద్యార్థులు వివిధ ట్రేడ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వృత్తి విద్యాకోర్సుల్లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సుల్లో చేరిన వారికి శిక్షణ సమయంలో పారితోషికంతో పాటు రూ.15 వేల టూల్‌కిట్ అందజేయడం జరుగుతుందన్నారు. వివరాల కోసం 98499 39025ను సంప్రదించాలని సూచించారు.

◆ పాఠశాలలకు విరాళం

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన కొల్లూరి శ్యామ్‌ప్రసాద్ కుమారుడు చిరంజీవి గౌతమ్ కృష్ణ పుట్టిన రోజున సందర్భంగా గురువారం శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు రూ.10,116 విరాళం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రబంధకారిణి సభ్యుడు డాక్టర్ నరేష్‌బాబు మాట్లాడుతూ మన దేశం ధార్మిక చింతనకు, సేవానిరతికి నిలయమన్నారు. ఆపన్నహస్తం సంస్థ ద్వారా శ్యామ్ ప్రసాద్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

◆ యువకుల రక్తదానం

గజ్వేల్‌రూరల్: ఓ చిన్నారికి అత్యవసరంగా రక్తం అవసరం ఉన్నదని విషయం తెలుసుకున్న యువకులు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. చిన్నారి భానుశ్రీ గుండె ఆపరేషన్ కోసం ఓ పాజిటివ్ రక్తం ఆరు యూనిట్లు అవసరమైంది. విషయం తెలుసుకున్న గజ్వేల్‌కు చెందిన యువకులు హైదరాబాద్ వెళ్లి రక్తదానం చేశారు.

◆ చికిత్స పొందుతూ యువకుడి మృతి

సిద్దిపేటకమాన్: అప్పుగా ఇచ్చిన డబ్బు స్నేహితులు తిరిగి ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో జరిగింది. గురువారం సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన ఆరుట్ల సాయిప్రకాష్ (29) నారాయణరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో సబ్‌ఆర్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయిప్రకాశ్ నుంచి అతడి మిత్రులు కొంత అప్పు తీసుకున్నారు. తిరిగి ఇవ్వమంటే వారు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఈనెల 13వ తేదీన ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం సాయిప్రకాష్ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ సబ్సిడీపై జీలుగ విత్తనాలు

హుస్నాబాద్‌రూరల్: రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను అందిస్తుందని మండల వ్యవసాయ అధికారి నాగరాజు గురువారం తెలిపారు. హుస్నాబాద్‌లోని ఆగ్రోస్ కేంద్రాల్లో 80 క్వింటాళ్ల జీలుగ, 20 క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.